సాక్షి మెదక్

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



గద్దర్‌కు తుప్రాన్ వాసుల నివాళి

గద్దర్ మృతికి సంతాపంగా ఆయన సొంతూరు తూప్రాన్‌లో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి నివాళి అర్పించారు. 8లో



ఓపెన్ స్కూల్ ఓ వరం

రెగ్యులర్‌గా చదవలేని వారికి ఓపెన్ స్కూల్ ఓ వరమని జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు. 8లో



నాసిరకంగా మరమ్మతు పనులు

రూ. 30 లక్షలతో చేపట్టిన అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతు పనులు నాసిరకంగా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. 9లో

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి జితేందర్

మెదక్: చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ అన్నారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో రిటైనర్ లాయర్స్, పారాలీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ స్థాయిలో కొనసాగించే న్యాయసేవా (విలేజీ కేర్ సపోర్టు) సెంటర్లలో విధులు నిర్వర్తించే సభ్యులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రజలకు అవసరమైన న్యాయ సహాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీఎల్‌వీలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రగతిపై ప్రత్యేక దృష్టి



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రమేష్‌బాబు

చిన్నశంకరంపేట(మెదక్): పల్లెప్రగతి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాని అదనపు కలెక్టర్ రమేష్‌బాబు సూచించారు. సోమవారం మండలంలోని గవ్వలపల్లి, ఎస్.కొండాపూర్, రుద్రారం, ధరిపల్లి గ్రామాల్లో పర్యటించి పల్లెప్రకృతివనం, డంపుయార్డ్, శ్మశానవాటికల పనులను పరిశీలించారు. పల్లెప్రగతి పనులు బాగున్నాయని, మొక్కల మధ్య నీరు నిలువకుండా కార్యదర్శులకు ఆదేశించారు. గ్రామ కార్యదర్శుల పనితీరుపై స్థానిక ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎపీఓ గిరిధర్‌రెడ్డి ఉన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ చందూనాయక్

మెదక్: చిన్నారులకు వయసుతో పాటు వేసే అన్ని టీకాలను సకాలంలో వేయించాలని డీఎంహెచ్‌ఓ చందూనాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని గోల్కొండ వీధిలోని బస్తీ దవాఖానాను సందర్శించి, సేవలపై అడిగి తెలుసుకున్నారు. మిషన్ ఇంద్ర ధనుస్సు కార్యక్రమంలో చిన్నారులకు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పిల్లలకు టీకాలు వేయిస్తే వ్యాధులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

చేనేతకు పూర్వ వైభవం

మెదక్ మున్సిపాలిటీ: చేనేత రంగానికి పూర్వ వైభవం తేవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మెదక్ మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వారానికి రెండు రోజులు అధికారులు చేనేత వస్త్రాలను ధరించాలని, పాఠశాల స్థాయిలో విద్యార్థులకు చేనేత వస్త్రాలతో కలిగే ప్రయోజనాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన నేతన్నల గొప్పదనాన్ని విద్యార్థులకు తెలియజెప్పాలన్నారు. అంతకుముందు పట్టణంలోని కొండా లక్ష్మణ బాపూజీ విగ్రహానికి డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి చేనేత ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జునగౌడ్, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్ పాల్గొన్నారు.

దత్తత గ్రామంలో అభివృద్ధి ఏదీ?

హవేళీఘనపూర్: మెదక్ ఎమ్మెల్యే దత్తత గ్రామం బూర్గుపల్లిలో అభివృద్ధి కానరావడం లేదని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆరోపించారు. సోమవారం బూర్గుపల్లిలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దత్తత తీసుకున్న బూర్గుపల్లిలో ప్రజలకు రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నారని అన్నారు. ఆయా పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరగా, కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయనతో ఆంజనేయులు, పల్లె రాంచందర్‌గౌడ్, మంజుల, సిద్దాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, రాములు, శ్యాంసుందర్, శ్రీనివాస్‌రావు, రాములు, యాదాగౌడ్, రమేష్, మల్లేష్, రామారావు తదితరులు ఉన్నారు.

పోషకాహారం.. ఆరోగ్యం

- సత్ఫలితాలిస్తున్న న్యూట్రీషన్ కిట్
- జిల్లాలో 2,233 మందికి అందజేత
- ప్రస్తుతం మూడు ఆస్పత్రుల్లో పంపిణీ

మెదక్: బిడ్డకు జన్మనిచ్చే తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ క్షేమంగా ఉంటుంది. ప్రోటీన్స్, మినరల్స్, విటమిన్స్ కూడిన పోషకాహారం అందిస్తూ హిమోగ్లోబిన్ శాతం పెంపు లక్ష్యంగా ప్రభుత్వం న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేస్తోంది. ప్రసవం అనంతరం ఇస్తున్న కేసీఆర్ కిట్ సక్సెస్ కావడంతో అర్హులైన గర్భిణులకు ఈ కిట్‌ను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు న్యూట్రియంట్ కిట్ ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు. తొలుత మూడో నెల, ఐదో నెలలో అందించగా, ప్రస్తుతం ఏడో నెల గర్భిణులకు పంపిణీ చేస్తున్నారు.

జిల్లాకు 2,233 కిట్‌లు..

జిల్లా కేంద్రంలో మాతాశిశు ఆస్పత్రి 2022 మే నెలలో అందుబాటులోకి వచ్చింది. ప్రతీ నెలా 350 నుంచి 400 ప్రసవాలు జరుగుతున్నాయి. రక్తహీనత ఇతర సమస్యలతో బాధపడుతున్నా వారికి మెదక్ ఎంసీహెచ్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో గత జూన్ నుంచి అర్హులైన గర్భిణులకు ఈ కిట్లను అందిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జిల్లాకు 2,233 కిట్లు సరఫరా కాగా, మెదక్ ఎంసీహెచ్‌కు 1,352, నర్సాపూర్ ఆస్పత్రికి 452, తూప్రాన్ 392 చొప్పున అందించారు. మెదక్ ఎంసీహెచ్‌లో ఈనెల 5న కిట్లు అయిపోగా నర్సాపూర్‌లో 4, తూప్రాన్‌లో 53 కిట్లను త్వరలో పంపిణీ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. కిట్‌లో.. కిలో న్యూట్రీషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూర, ఐరన్ సిరప్ 3 బాటిల్స్, అరకేజీ నెయ్యి, ఆల్‌బెండజోల్ టాబ్లెట్, ఒక కప్పు, ప్లాస్టిక్ బాస్కెట్ కలిపి మొత్తం రూ.2వేల విలువగల కిట్‌ను అందిస్తున్నారు. రక్తహీనతతో బాధపడే వారికి కిట్‌లో ఉండే పోషకాహారంతో హిమోగ్లోబిన్ శాతం పెరిగి, పుట్టబోయే శిశువు ఆరోగ్యానికి దోహదపడుతుంది.



న్యూట్రీషన్ కిట్‌లోని వస్తువులు

ఎంతో లాభదాయకం

ప్రభుత్వం గర్భిణీలకు అందించే న్యూట్రీషన్ కిట్ ఎంతో లాభదాయకంగా ఉంది. కిట్‌లో ఆహారాన్ని క్రమంతప్పకుండా తీసుకుంటే రక్తహీనతను దూరం చేయొచ్చు. ప్రసవ సయమంలో తల్లీబిడ్డకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రావు. గత రెండు నెలలు ఏడు నెలలు నిండిన అర్హులైన గర్భిణులకు ఈ కిట్‌లను అందిస్తున్నాం

– డాక్టర్ శివదయాల్, గైనిక్

సత్ఫలితాలు వస్తున్నాయి



ప్రభుత్వం అందిస్తున్న ఈ కిట్‌లతో గర్భిణులకు పోషకాహారం అందుతుంది. ప్రసవ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. సాధారణ, శస్త్రచికిత్స ఏదైనా తల్లీబిడ్డా క్షేమంగా ఉంటారు. కిట్‌తో మంచి ఫలితాలు వస్తున్నాయి.

– డాక్టర్ పీసీ శేఖర్, డీసీహెచ్‌ఎస్

తెరపైకి కొత్త మండలాలు

- గంగ్వార్, తాటిపల్లి, తడ్కల్ వాసుల డిమాండ్
- అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రస్తావన
- పెద్దశంకరంపేట్, రేగోడ్‌లను సంగారెడ్డిలో కలపాలని వినతి

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: కొత్త మండలాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలను, కొత్త జిల్లాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఇప్పుడు తమ గ్రామాన్ని కూడా మండలంగా ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, భూపాల్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 13 కొత్త మండలాలను ప్రకటించిన ప్రభుత్వం.. ఇందులో భాగంగా జిల్లాలోని నిజాంపేట్‌ను కూడా కొత్త మండలంగా ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. అంతకు ముందు 2019 పంచాయతీ ఎన్నికల సందర్భంగా అమీన్‌పూర్ వంటి కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. తాజాగా ఇప్పుడు మరిన్ని కొత్త మండలాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. న్యాల్‌కల్ మండలంలో గంగ్వార్, హద్నూర్‌లలో ఏదైన ఒక మండలాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. కర్నాటక సరిహద్దుల్లోని సుమారు 17 గ్రామాలను కలిపి ఒక మండలంగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాజోల, కల్‌బేమల్, మామిడిగి, వడ్డి, శంశిల్లాపూర్, రేజింతల్ గ్రామాల ప్రజలు కొత్త మండలాన్ని కోరుతున్నారు. గంగ్వార్‌తో పాటు, హద్నూర్ గ్రామాల ప్రజలు మండలంగా ప్రకటించాలని నిరసన కూడా వ్యక్తం చేశారు. న్యాల్‌కల్ మండలంలో 29 గ్రామాలు, ఆరు తండాలతో జిల్లాలో అతిపెద్ద మండలాల్లో న్యాల్‌కల్ ఒకటి. అలాగే.. మారుమూల మండలం కంగ్టిలో తడ్కల్‌ను కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు గతంలో రిలేనిరాహార దీక్షలు కూడా చేశారు. ఈ మండలం ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపారు. 18 గ్రామాలను కలిపి మునిపల్లిలోని తాటిపల్లిని కూడా మండలం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మా మండలాలను సంగారెడ్డిలో చేర్చండి

మెదక్ జిల్లా పరిధిలో ఉన్న పెద్దశంకరంపేట్, రేగోడ్ మండలాలను సంగారెడ్డి జిల్లాలో కలపాలని స్థానికులు కోరుతున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాలు సంగారెడ్డి జిల్లాలోనే ఉన్నాయి. ఒక్క పెద్ద శంకరంపేట్ మాత్రమే మెదక్‌లో ఉంది. జిల్లా కేంద్రం మెదక్‌కు వెళ్లడం దూర భారం అవుతోందని, తమ మండలాన్ని సంగారెడ్డికి మార్చితే సౌలభ్యంగా ఉంటుందని వారు చెబుతున్నారు. రేగోడ్ మండలాన్ని కూడా సంగారెడ్డిలో కలపాలని 18 రోజుల పాటు నిరసన తెలిపారు. సంతకాల సేకరణ కూడా చేశారు. తాజాగా మెదక్ కలెక్టర్‌కు రాజర్షిషాకు ఇటీవల వినతిపత్రం అందజేశారు.

చిన్నారుల కోసమే మోడల్ కేంద్రం

ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి

నర్సాపూర్ రూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సౌలభ్యం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రం సేవాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. పిల్లలకు ఆట వస్తువులు, యాక్టివిటీ పరికరాలు, ఆటపాటలతో కూడిన చదువును అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గర్భం దాల్చగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలని, కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, నులిపురుగు నివారణ మాత్రలు వాడాలన్నారు. అనంతరం కార్యక్రమకంలో పాల్గొన్న పీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వతోపాటు రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిని బ్రహ్మాజీ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, జెడ్పీటీసీ బాబీ నాయక్, అశోక్ గౌడ్ నయీమ్, నగేష్, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, సీడీపీఓ హేమ భార్గవి తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి

స్వాతంత్య్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భవనాలను అలంకరించాలని, ప్రజాప్రతినిధులు, స్వాతంత్య్ర సమరయోధులు, పాత్రికేయులు, ప్రజలకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయాలని ఆర్డీఓ, అర్బన్ తహసీల్దార్‌కు ఆదేశించారు. సభా ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని మున్సిపాల్ అధికారులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రగతి సందేశాన్ని తెలిపే శకటాలను, స్టాళ్లు ఏర్పాటు చేయాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

70 సైట్‌లను గుర్తింపు

హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు జిల్లాలో 70సైట్లు గుర్తించినట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాంటేషన్ వేగంగా జరుగుతుందని, అటవీప్రాంతంలో మొక్కలను నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని, వ్యవసాయేతర భూముల క్రమబద్ధీకరణ, నోటరీ వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్‌పై ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారులు వెంకట శైలేష్, సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మి, రవిప్రసాద్, నర్సయ్య, ఆర్డీఓ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

బాధితులకు తక్షణ న్యాయం

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు ఇచ్చిన బాధితులకు తగిన న్యాయం చేయాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పోలీసు అధికారులు సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తన కొడుకు హింసిస్తున్నాడని న్యాయం చేయాలని టేక్మాల్ మండలం కూసంగి గ్రామానికి చెందిన పెద్దాపురం మల్లయ్య ఫిర్యాదు చేయగా, చౌదరిపేటకు చెందిన వ్యక్తిని కులాంతర వివాహం చేసుకున్నానని, తన భర్త మరొకరితో ఉంటూ తనను హింసిస్తున్నాడని వెల్దుర్తి మండలం మంగళపర్తికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టిన ప్రయోజనం లేకపోవంతో ఎస్పీ కార్యాలయానికి వచ్చానని, తనకు న్యాయం చేయాలని కోరింది. స్పందించిన ఎస్పీ బాధితురాలికి చట్టప్రకారం న్యాయం చేయాలని వెల్దుర్తి ఎస్‌ఐకి సూచించారు.



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని


భగీరథ నీరు సురక్షితం

నర్సాపూర్: నల్లాల ద్వారా వస్తున్న నీటి రంగు మారినా తాగవచ్చని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ అన్నారు. సోమవారం భగీరథ సిబ్బంది, కౌన్సిలర్ యాదగిరితో కలిసి నల్లాలు, ట్యాంకుల నుంచి నీటి శాంపిల్స్ సేకరించారు. ల్యాబ్ పరీక్షల్లో సురక్షితమేనన్న ఫలితం వచ్చిందన్నారు.



నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కొలువుదీరిన కొత్త పాలకవర్గం



ఆలయం ఎదుట పాలకవర్గ సభ్యులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయలను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతానని నూతన పాలక వర్గ చైర్మన్ సాతెల్లి బాలాగౌడ్ అన్నారు. సోమవారం నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడారు. ఏటా రూ.6 కోట్ల ఆదాయం ఉన్న దుర్గమ్మ ఆలయ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మంజీరా నది చుట్టూ గెస్ట్ హౌస్‌లు నిర్మించి, శివరాత్రి జాతర ఘనంగా నిర్వహిస్తామన్నారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. డైరెక్టర్లుగా బాలాగౌడ్, శ్రీనివాస్ రావు, మాణెమ్మ, వెంకటేశం, సిద్ధిరాములు, పెంటయ్య, మోహన్‌రావు, దొడ్ల మనోహర్, సాయిలు, నాగభూషణం, రఘువీర్, యాదాగౌడ్, బాగారెడ్డి, చక్రపాణి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ పూజారి శంకరశర్మ ఉన్నారు.

మా భూములు మాక్కావాలి



కలెక్టరేట్‌లోకి దూసుకెళ్తున్న గిరిజనులను అడ్డుకుంటున్న పోలీసులు

కలెక్టరేట్ ఎదుట గిరిజనుల ధర్నా

మెదక్ కలెక్టరేట్: ఏళ్లుగా సాగు చేస్తున్న భూములను మాకే ఇవ్వాలని గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్‌రాం నాయక్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కలెక్టరేట్‌లోనికి వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకోవడంతో వారిని తోసుకొని కలెక్టరేట్‌లోకి పరుగులు పెట్టారు. ఈ క్రమంలో గిరిజనులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం గేటు వద్ద కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు దాస్‌రాం నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలు ఇస్తామని ప్రకటించి కేవలం రెండు, మూడు గ్రామాల వారికే ఇచ్చిందని, మిగతా వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల భూములను లాక్కొని ప్రభుత్వ కార్యాలయాలు కడుతున్నారని ఆరోపించారు. పోడు భూములను గిరిజనులకు పంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరెట్ ఏఓ వచ్చి గిరిజనుల నుంచి పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం తీసుకోవడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు ప్రకాష్ రాథోడ్, గోపాల్ నాయక్, రాజేష్ నాయక్, ప్రేమ్ నాయక్, శాంతి నాయక్, గిరిజనులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి కృషి

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: సమస్యలపై ప్రజావాణిలో ఇచ్చిన అర్జీలపై అధికారులు తక్షణం స్పందించి పరిష్కారం చూపాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ పద్మశ్రీలతతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధి, పింఛన్లు, దళితబంధు, డబుల్‌బెడ్‌రూం తదితర సమస్యలపై పలువురు అర్జీలు పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై ఫిర్యాదు దారులకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కాగా అల్లాదుర్గం మండలం ముప్పారం గ్రామంలో దళితులు అందరికీ దళితబంధు ఇవ్వాలని గ్రామస్తులు రాములు, నాగరాజు, రవి, కృష్ణ, మొగులయ్య, లింగమయ్య, పోచయ్య, దేవమ్మ, స్వరూప డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

అందరికీ ఇవ్వాలి



మా గ్రామంలో 40 దళిత కుటుంబాలు ఉన్నాయి. అందరం నిరుపేదలమే. కూలి పని చేసుకుని జీవనం సాగించేవాళ్లం. గ్రామంలో నలుగురికి మాత్రమే దళితబంధు ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి అందరికీ దళితబంధు ఇవ్వాలి. – ముప్పారం గ్రామస్తులు

ఉండేందుకు ఇల్లు లేదు



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మా ఇల్లు కూలిపోయింది. దీంతో ఉండడానికి చోటు లేక చెట్ల కింద ఉంటున్నాం. మా పరిస్థితిని గమనించి డబుల్‌బెడ్‌రూం మంజూరు చేసి ఆదుకోవాలి.

– ఎర్రొల్ల మొగులమ్మ, ముప్పారం, అల్లాదుర్గం

రేషన్ కార్డు ఇస్తలేరు



రేషన్ కార్డు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసు కున్న ఇస్తలేరు. గతంలో ఉన్న కార్డు పని చేయడంలేదు. కొత్త కార్డు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. – దుర్గమ్మ, అచ్చనపల్లి, టేక్మాల్

క్లుప్తంగా

జిల్లా ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్

హుస్నాబాద్: జిల్లా ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన బుర్ర రాజేందర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా జనరల్ బాడీ సమావేశం సోమవారం సిద్దిపేటలో నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల ఆఫీసర్‌గా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు వ్యవహరించారు.

హుబ్లీ మార్కెట్ యార్డు సందర్శన



హుబ్లీ మార్కెట్ యార్డును సందర్శించిన మార్కెట్ పాలకవర్గ సభ్యులు, అధికారులు

హుస్నాబాద్: స్టడీ టూర్‌లో భాగంగా కర్ణాటకలోని హుబ్లీ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, అధికారులు సందర్శించారు. హుబ్లీ మార్కెట్ యార్డ్ నిర్వహణ, రైతులకు అందిస్తున్న గిట్టుబాటు ధరలు, క్రయవిక్రయాలు, సౌకర్యాలు, ఆదాయ మార్గాలను సమకూర్చుకోవడం వంటి అంశాలపై అధ్యయనం చేశారు. అక్కడి మార్కెట్ యార్డులో రైతులకు అందించే సేవలు, ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, మార్కెట్ అభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల పాత్రపై క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ రజని తిరుపతిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ రజిత, మార్కెట్ కార్యదర్శి సుజన్. పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరుటౌన్ : గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన అమీన్‌పూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కిష్టారెడ్డిపేట గ్రామశివారులోని వాగులో గుర్తుతెలియని మహిళ (35) మృతదేహాన్ని గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని బయటికి తీయించారు. పంచనామా నిర్వహించగా మృతురాలి చేతిపై హిందీలో ఓం అని రాసి ఉంది. చనిపోయి సుమారు 10 రోజులై ఉండొచ్చని, మృతదేహం కుళ్లిన స్థితిని బట్టి పోలీసులు భావిస్తున్నారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల రద్దుకు కుట్ర



నివాళులు అర్పిస్తున్న సంఘం నాయకులు

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం కామన్ సివిల్‌కోడ్ తెచ్చి రాజ్యాంగ హక్కులను రద్దు చేసేందుకు కుట్ర పన్నుతోందని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్ రాథోడ్ ఆరోపించారు. ఈ కుట్రను వ్యతిరేకిస్తూ రాష్ట్రీయ ఆదివాసీ ఏకతా పరిషత్ సోమవారం భారత్ బంద్ పిలుపులో భాగంగా సోమవారం ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఖేడ్ అంబేడ్కర్ చౌక్‌లోని ఆయన విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కామన్ సివిల్ కోడ్ ద్వారా రాజ్యాంగం ద్వారా కల్పించిన ఎస్టీ గుర్తింపును రద్దు చేసి హక్కులు, అధికారాలను హరించాలని యత్నిస్తోందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, ఉపాధ్యక్షుడు రమావత్ సురేష్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, వినోద్‌నాయక్, రవినాయక్, వంశీ, విఠల్, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

గద్దర్‌కు తూప్రాన్ వాసుల నివాళి



పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

స్వచ్ఛందంగా దుకాణాల మూసివేత

తూప్రాన్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ మృతికి సంతాపంగా సొంత ఊరు తూప్రాన్ వాసులు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన జ్ఞాపకాల నీడలో వారి అనుభావాలను నేమరు వేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. స్వచ్ఛందంగా బంద్ పాటించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. పట్టంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేపట్టి, ఆర్టీసీ బస్‌స్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంతాప సభ నిర్వహించారు. గద్దర్ అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. మేడ్చల్ జిల్లా అల్వాల్‌లో నిర్వహించిన అంత్యక్రియలకు భారీ సంఖ్యలో ప్రజలు, నాయకులు తరలివెళ్లారు.

సేవా గుణం కలవాడు



తన పాటలతో ప్రజలు చైతన్యపరిచి ఎంతో అభిమానులను సంపాదించుకున్నాడు. తోచినంతలో పేదలకు సాయంవాడు. సేవా గుణం కలిగిన వ్యక్తిని కోల్పోవడం బాధాకరం.

– గద్దం సత్తయ్య, తూప్రాన్

ప్రేమతో పలకరించేవారు



సొంతూరు తూప్రాన్‌కు ఎప్పుడు వచ్చినా.. అందరిని ప్రేమతో పలకరించేవారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకొని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లేవారు. హల్దీవాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ చెరువులను నింపించారు.

– మామిడి వేంకటేశ్, మున్సిపల్ కౌన్సిలర్

ఎస్.కొండాపూర్ తండాను జీపీగా చేయండి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఎస్.కొండాపూర్ తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్.కొండాపూర్ మధిర గ్రామమైన ప్యాటగడ్డ, గిరిజన తండాను కలిపి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు, రామ్‌రెడ్డి, బీమరి ఆయదగిరి, సిద్ధిరాములు, అంజనేయులు, దశరథం, రమేశ్, వెంకట్, శివన్ నాయక్, హరీనాయక్, జాగ్యనాయక్ ఉన్నారు.



మెదక్ ఎమ్మెల్యేతో ఎస్.కొండాపూర్ తండా, ప్యాటగడ్డ గ్రామస్తులు

వివాహిత ఆత్మహత్య

పటాన్‌చెరుటౌన్: ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం...పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎస్.కె హర్దాన్, ఇద్దరు భార్యలు మీతూ సర్దార్, సుహానాతో కలిసి నందిగామలో నివాసం ఉంటూ, ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రెండో భార్య మీతూ సర్దార్(34) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

ప్రాణాలు ఫణంగా పెట్టి పని చేశాం

- సెకండ్ ఏఎన్ఎంల ఆవేదన
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

మెదక్ కలెక్టరేట్: కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి విధులు నిర్వర్తించిన తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని ఏఎన్ఎంల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంగీత అన్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సెకండ్ ఏఎన్ఎంలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సంగీత మాట్లాడుతూ.. 20ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నామని, పనికి తగిన వేతనం మాత్రం అందడంలేదని వాపోయారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన సీఎం కేసీఆర్ మా శ్రమను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయా మండలాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చేప పిల్లలు మృత్యువాత

శివ్వంపేట(నర్సాపూర్) : నవాబుపేటలోని సాంబయ్య చెరువులోకి కలుషితమైన కెమికల్ వ్యర్థాలతో చేప పిల్లలు మృత్యువాత పడ్డాయని సోమవారం పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు నీటిలో కెమికల్ వ్యర్థాలు కలిసి నష్టం వాటిల్లిందని ఇంద్రేష్, మల్లేష్, రవి, యాదగిరి, రాజు, కృష్ణ ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాలని రామచంద్రపురంలోని పీసీబీ కార్యాయలంలో ఫిర్యాదు చేశారు. గతంలో 50 వేల చేపపిల్లలను చెరువులో వదిలామన్నారు

ఉపన్యాస పోటీల్లో ప్రతిభ

వెల్దుర్తి(తూప్రాన్): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని అర్చన పోటీల్లో ద్వితీయ స్థానంలో గెలుపొందగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆమెకు సర్టిఫికెట్‌తో పాటు మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎం సాంబయ్య, పీడీ ప్రతాప్‌సింగ్ రాథోడ్, పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

అణు విజ్ఞానంతో సరికొత్త అభివృద్ధి



నవోదయ విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

- బార్క్ యువ శాస్త్రవేత్తలు

వర్గల్(గజ్వేల్): దేశ, విదేశాల్లో ఇప్పటికే అణు విజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయ, వైద్య రంగాలలో సరికొత్త అభివృద్ధి సాధించారని బార్క్(బాబా అటామిక్ రిసెర్చ్‌సెంటర్) యువ శాస్త్రవేత్తలు డాక్టర్ అభిజిత్ సాహ, డాక్టర్ జ్యోత్స్న భట్ అన్నారు. అణు విజ్ఞానం కేవలం విధ్వంసానికే పరిమితమనే అపోహ విడాలని, శాంతిస్థాపనకు, వైద్య, వ్యవసాయ రంగాల పురోగతికి కూడా ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. భారత పరమాణు శక్తిని విద్యార్థులకు పరిచయం చేసి వారు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన ప్రేరణ కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బార్క్‌తో అనుసంధానమై పరమాణు జ్యోతి కార్యక్రమాన్ని నవోదయ విద్యాలయాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించిందన్నారు. సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించిన శాస్త్రవేత్తలకు ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్‌ప్రిన్సిపాల్ సత్యవతి బృందం సాదర స్వాగతం పలికారు. అనంతరం విద్యాలయ మల్టీపర్పస్ హాల్‌లో విద్యార్థులతో సమావేశమై పరమాణు విజ్ఞానంపై ఆసక్తి పెంపొందింపజేసేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. క్విజ్ పోటీ నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ఆన్‌లైన్ ద్వారా బార్క్ డైరెక్టర్ అజిత్ కుమార్ మహంతిని విద్యార్థులకు పరిచయం చేశారు. రాబోయే కాలంలో పరమాణు విజ్ఞానం ఎన్నో సౌకర్యాలకు ఊతంగా ప్రజలకు అత్యంత చేరువై, నిత్య జీవితంలో భాగంగా మారనుందన్నారు. నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఓ వరం

- తెలుగురాష్ట్రాల్లో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు
- జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి

నంగనూర్/హుస్నాబాద్: రెగ్యులర్‌గా చదవలేని వారికి ఓపెన్ స్కూల్ ఓ వరమని జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం అడ్మిషన్ నమోదు డ్రైవ్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ, పెద్దవాళ్లకు, మధ్యలో చదువు మానేసిన వారికి, ఉద్యోగం చేస్తూ ప్రమోషన్ పొందాలనుకునే వారికి, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే వారికి, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస 10వ తరగతి, ఇంటర్ పాస్ కావాలని కోరుకునే వారికి ఒక మంచి అవకాశం ఉన్నారు. ఏదొక పని చేసుకుంటూ సెలవు రోజుల్లో మాత్రమే ఓపెన్ స్టడీ సెంటర్‌కు వచ్చి క్లాసులో విని ఇంట్లో కూర్చోని చదువుకుంటే సరిపోతోందన్నారు. ఓపెన్ 10వ తరగతి, ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ 10వ తరగతి, ఓపెన్ ఇంటర్ చేయడానికి అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వారే కాకుండా తెలుగు రాష్ట్రాల్లోని వాళ్లు ఎవరైన దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, కో ఆర్డినేటర్ బండారి మనీల, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పంజా రాజమల్లు, మండల నోడల్ ఆఫీసర్ శంకర్ నాయక్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

డయోగ్నస్టిక్ పరీక్ష బహిష్కరిస్తాం

- సమ్మెకు దిగుతాం : ల్యాబ్ టెక్నీషియన్లు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ డయోగ్నస్టిక్ ఆన్‌లైన్.. పరీక్షలను బహిష్కరిస్తామని ల్యాబ్ టెక్నీషియన్లు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో పనిచేస్తున్న తమ సేవలను గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్‌తో పాటు గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో సుమారు 620 మంది ల్యాబ్ టెక్నీషియన్లు డీఎస్సీ ద్వారా ఎంపికై 22 ఏళ్లుగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి వైద్యుల మాదిరిగానే వెయిటేజ్ మార్కులిచ్చి క్రమబద్ధీకరించాలని, హెల్త్ కార్డులు లేదా హెల్త్ ఇన్సూరెన్స్, సమాన పనికి సమాన వేతనం, పీఆర్సీ పేస్కేల్ వర్తింపజేయాలని, కారుణ్య నియామకాలతో పాటు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి సెలవులు ఇప్పించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వినతి అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఎంలు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని కొండాపూర్‌లో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన గుండం వెంకటమ్మ వెంకట్రాంరెడ్డి దంపతుల ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో మంటలు చెలరేగాయి. స్థానికులు సిద్దిపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సకాలంలో సిబ్బంది చేరుకొని చుట్టు పక్కల మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పెంకుటిల్లు పైకప్పుతోపాటు వస్తువులు, దుస్తులు, బియ్యం కాలి బూడిదయ్యాయి. సుమారు రూ. లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో 3 రోజుల నుంచి జరిగిన పలు సైబర్ నేరాల వివరాలు తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. బెజ్జంకి స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తన బ్యాంక్ ఖాతాకు ఫోన్ నంబర్ లింకు చేయాలన్నాడు. బాధితుడు తన ఫోన్ లింకును ఓపెన్ చేసి ఓటీపీ వివరాలు నమోదు చేశాడు. అంతే ఖాతా నుంచి రూ.47,200 డెబిట్ అయినట్లు మెసెజ్ వచ్చింది. అలాగే కుకునూర్ పల్లి స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ఓ యాప్ ద్వారా లోన్ తీసుకుని తిరిగి మొత్తం చెల్లించాడు. కానీ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఇంకా డబ్బులు చెల్లించాలని లేకుంటే ఫొటోలు న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. భయపడిన బాధితుడు రూ.5వేలు పంపించాడు. కాగా సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి ఆన్‌లైన్ యాప్ ద్వారా లోన్ మంజూరైందని గుర్తు తెలియని వ్యక్తి లింక్ పంపించాడు. ఆ లింకును ఇన్‌స్టాల్ చేయగానే బాధితుడి ఖాతా నుంచి రూ.5వేలు డెబిట్ అయినట్లు మెసెజ్ వచ్చింది. తర్వాత గుర్తుతెలియని వ్యక్తికి కాల్‌చేయగా ఫొటోలు మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. పలు కేసుల్లోని బాధితులు జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారని సీపీ తెలిపారు.

'డబుల్' ఇళ్లు ఐదు శాతం కేటాయించాలి

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

కొండాపూర్(సంగారెడ్డి): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో తమకు 5 శాతం కేటాయించడంతోపాటు గృహలక్ష్మిలో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ శరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడారు. జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లోని ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాక్ పోస్టులు గుర్తించాలన్నారు. స్వయం ఉపాధి కోసం ఎలాంటి షూరిటీ లేకుండా రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై జిల్లా అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇస్మాయిల్, జయలక్ష్మి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం ఉపాధ్యక్షుడు పోచయ్య, ప్రకాష్‌రావు, సంగమేశ్వర్, లక్ష్మి, సత్యనారాయణ, దివ్యాంగులు పాల్గొన్నారు.




కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విషం తాగి వ్యక్తి మృతి

కొల్చారం(నర్సాపూర్): కుటుంబ కలహాల కారణంగా విషం తాగిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లి గిరిజన తండాలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాలు.. పోతిరెడ్డిపల్లి గిరిజన తండాకు చెందిన కోల శ్రీనివాస్ (30) కూలి పని పనిచేసుకునే వాడు. ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తలు తరచుగా గొడవపడేవారు. ఈ క్రమంలో ఈనెల 4న భార్య రజితతో గొడవ పడి ఇంటి పక్కనున్న పొలానికి వెళ్లి వస్తానన్నాడు. తర్వాత అతడిని అపస్మారక స్థితిలో ఉండటాన్ని భర్య గమనించింది. పక్కనే పురుగులమందు డబ్బా పడి ఉంది. చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న అతడు ఆదివారం రాత్రి మృతిచెందాడు.

చికిత్స పొందుతూ..




బ్రహ్మం

హవేళీఘనపూర్: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బూర్గుపల్లిలో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బ్రహ్మం(56) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబీకులు మెదక్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో తరలించగా, అక్కడ మృతిచెందాడు. కేసును ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు అరుదైన ఆపరేషన్

- కాలులోని 3 కిలోల కణితి తొలగింపు



దుబ్బాకటౌన్ : మహిళకు అరుదైన ఆపరేషన్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. సోమవారం వైద్యులు ఆమె కాలు నుంచి 3 కిలోల కణితిని తొలగించారు. సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తికి చెందిన పోతి రాజవ్వ కాలి కణితి గడ్డ తొలగించడానికి రూ.50 వేలకుపైగా ఖర్చు అవుతుందని పలు ప్రైవేట్ ఆస్పత్రుల వారు తెలిపారు. ఆర్థిక స్థోమత లేని కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించారు. బాధితురాలికి వైద్యులు భరోసానిచ్చి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా కణితిని తొలగించారు. కాగా ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. వైద్యులకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.



కణితిని తొలగించిన వైద్యబృందం

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్



నియామక పత్రాన్ని అందజేస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వం కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి డిమాండ్ చేశారు. రానున్న 2023 సాధారణ ఎన్నికల్లో కురుమ వర్గానికి 12 ఎమ్మెల్యేలతోపాటు 2 ఎంపీ, 4 ఎమ్మెల్సీ స్థానాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలో ఉన్న మల్కాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా మండలలాలకు, తాలుకాలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం వారికి, మల్‌శెట్టి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కురుమ గొర్రె, మేకల పెంపకం దారులకు రూ. 5వేలు పెన్షన్ మంజూరు చేయడంతోపాటు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి గ్రామ సొసైటీకి జీఓ 559ను అమలు చేస్తూ 5 ఎకరాల భూమిని మంజూరు చేయాలని చెప్పారు. గతంలో ఎన్‌సీడీసీ పథకం ద్వారా గొర్రెల యూనిట్‌కు పావలా వడ్డీ కింద తీసుకున్న లక్ష రూపాయలను పూర్తిగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కురుమల ఆరాధ్య దైవం బీరప్ప మందిరాల వద్ద సేవలందిస్తున్న పూజారులకు దూప దీప నైవేద్యం పథకం ద్వారా జీతభత్యాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు గోవింద్, ప్రభాకర్, ప్రధానకార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు దేవయ్య, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. సోమవారం శివ్వంపేటలో సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ తలపెట్టిన చలో హైదరాబాదు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ 33 జిల్లాల నుంచి 54 సంఘాలతో ఈ నెల 12న చలో హైదరాబాదు కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా పండగలు జరుపుకోవాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ రూరల్: కులమతాలకు అతీతంగా పండగలు జరుపుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాగజ్ మద్దూర్‌లో కొనసాగుతున్న కొత్త పీర్ సవారీలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాగజ్ మద్దూర్‌లో కులమతాలకు అతీతంగా పీర్ల పండగలో పాల్గొని అసైదుల ఆటలు ఆడడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భోగ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.